# టెక్నిక్

—జె.ఎల్.ఎస్.శర్మ

"ఈరోజు పెందరాళే ఇంటికి వస్తారుగా?" రాధి గోముగా అడిగింది.

"ఏమిటేట విశేషం?" నవ్వుతూ అడిగాను.

"ఈ వేళ చాలా మంచి రోజు. అందుకని ఆఫీసు అవగానే నేరుగా ఇంటికొచ్చి... దేముడికి పూజ చేసుకుని మీరు ఏదన్నా నవల మొదలు పెట్టాలి... ఎన్నాళ్ళనుంచో అడుగుతున్నాను... అలాగే దాటేస్తున్నారు. ఇంక వూరుకునేది లేదు..."

రాధి మాటల్లో చాలా పట్టుదల, మీదుమిక్కిలి పంతం తొంగి చూశాయి. నాగుండె గుభేలు మంది. ఐనా నసుగుతూ అన్నాను.

"చూడూ ఏదన్నా సినిమాకు తీసుకుపోవడమను కున్నావా? పైగా రాయాలంటే ముందు మనకేం తెలుసని ఇంకొకరికి చెప్పను?"

"అబ్బే! ఈ కబుర్లు కట్టిపెట్టండి! నే రాయడం లేదూ?" నిజమే తను ఈ మధ్య రోజుకి ఓ దస్తాడు కాగితాలు రాస్తోంది. రోజూ అదంతా వినాలనీ అందులోని కవిచమత్కారాలు గ్రంటాలు ఎలా వున్నదీ, వర్ణించాలంటుంటే సరేనని కూర్చుంటున్నాను. ఎంత మనసు దిటవు చేసుకుంటున్నా కాసేపట్లో చక్కని సాయంత్రం పాడు చేసుకుంటున్నాననే దిగులు మొదలయ్యేది.

"ఏమిటి? వినకుండా పరాకుగా వున్నారు?" నిల వేస్తుంది మధ్యలో

"అహ ఏం లేదు! ఇప్పుడు నీవు చదివిన డైలాగు ఎక్కడో విన్నట్టు అనిపిస్తోంది..."

"భలేవారే! మనింట్లో ఈరోజు దోసకాయ పప్పు వండుకున్నాం కదా అని కాలనీలో ఇంకెక్కడా ఎవరూ వండుకోరా? ఇదీ అలాగే..." అంటూ సమర్థించు కుంది.

"నిజమేలే! ఇంతకూ నీ నవల ఎంతవరకు వచ్చింది..."

"సగం దాకా వచ్చింది. ఇక ఇక్కడే హీరో, హీరోయిన్ మీద అపార్థం చేసుకుంటాడు! ఎలాగైతే బాగుంటుందో తోచి చావడం లేదు... ఏదైనా కారణం మంచిది చెప్పరూ?"

"పోనీ అంత ఇబ్బంది పడి విడదీయక పోతేనేం?"

"అయ్యో రామ! విడిపోకుండా కలిసేదెలా?"

"కలవటం కోసం విడిపోవాలా?"

"మీతో ఎట్టా వచ్చేదండీ!? 'టెక్నిక్' తెలీదు... చెప్తే అర్థం కాదు... నా ఖర్మ... సర్లే... ఇదుగో చూడండీ! మీరు రోజూ పగలు ఆఫీసుకి పోతున్నారా... అలా విడిపోతున్నామనుకోండీ మనం రాత్రి మళ్ళీ కలిసి వుండటం లేదా?!" ఏదో ఓ మెట్టు దిగి నా స్థాయికి వచ్చి మాట్లాడుతున్నట్టు ఇలా జాగ్రత్తగా బోధించుకుంటూ పోతే కొన్నాళ్ళకు ఇతగాడూ మనుషుల్లో పడ్తాడనే ఆశతో వున్నట్టు మొహం పెట్టింది రాధి.

"సరే అంత 'టెక్నిక్కు' తెలీని నా దుంప తెంపకుండా ఆ విడదియ్యడం ఏదో నువ్వే చెయ్యరాదా?" "నాకూ అదా ఆయిడియా తోచక కాస్త రాసి పెట్టమని సాయం అడిగాను దానికి ఇంతగా ఆడిగించుకుంటారనుకోలేదు..." మొహం సోడా బుడ్డిలా పెట్టింది.

నేను గాబరా పడ్డాను.

"ఇదుగో మూతిసలా పోస్ట్ డబ్బాలా ముందుకు పెట్టకు! అసలే మన మొహం అంతంత మాత్రం సరే... ఓ పెన్ను కాయితం... ఇలా పట్రా...!"

"అక్కర్లేదు లెండి,? నా ఇష్టం వచ్చినట్టు రాస్తాను. మళ్ళీ ఇదేమిటి అదేమిటి అని మటుకు అడక్కండి." విసురుగా లోపలికెళ్ళిపోయింది రాధి...

నేనూ అంతగా 'బతిమాలదలచలేదు...' ఎలాగో రాయడం తప్పింది కదా?" అని సంతోషించి ఆఫీసు కెళ్ళిపోయాను.

సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే ఆ రోజు తను చేసిన 'రచన' నాముందుంచి..., "చదువుతూండండీ! నేను కాఫీ కలుపు కొస్తాన"ని వంటింట్లో కెళ్ళింది.

ఇంట్లో కాలు పెడుతూనే ఈ రకమైన 'తాకిడి'కి నెమ్మదిగా అలవాటు పడ్డ నేను 'కాఫీ తాగి చదవటం మొదలు పెడదామా?' అని ఆలోచించి... కాన్లే... చదివాక పోయిన మూడ్‌ని కాఫీతో స్ట్రైట్ చేసుకో వచ్చున'ని సాహసించి చూకాను.

... ... ...

"రిక్షాలోంచి దిగుతున్న అపర్ణను చూడగానే ఆనందంతో మోహన్ మొహంలో కోటికాంతులు వెలిగాయి. దగ్గరకు వెళ్ళి గ్రీట్ చేద్దామనుకుని నలుగుర్లోనూ పలకరిస్తే కోపగిస్తుందేమో?' అని ఒక క్షణం తటపటాయించి, 'వద్దులే! దూరం నించే, తన వేపు చూసినప్పుడు పలకరింపుగా నవ్వుదాం..." అనుకుని అటే చూస్తున్నాడు.

పర్సులోంచి అపర్ణ తీసిన ఐదు రూపాయిలనోటు మోహన్‌కి కనపడలేదు.

"చిల్లర లేదు తల్లీ!" నీరసంగా పలికాయి తాతకళ్ళు.


"పోనీలే తాతా! పెద్ద వాడివి... వుంచుకో!"

"ఎంత దయగల తల్లివి?! దేముడు నిన్ను చల్లగా చూడాలమ్మా!"

'ఏమిటి ఇంత సేపారిక్షా వాడితో మాటలు? దూరం నుంచి చూస్తున్న మోహన్ భృకుటి ముడి పడింది. తన వంక చూస్తే నవ్వు ముఖంతో గ్రీట్ చేద్దామని తను ఎదురు చూస్తుంటే... ఆ కుంకతో



ఇటీవల రాజమండ్రి గౌతమి గ్రంథాలయంలో జరిగిన "శ్రీ హనుమదింద్రగంటి సాహిత్య సమగ్రావలోకనం" గ్రంథావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న శ్రీ ఇంద్రగంటి శ్రీ కాంతశర్మ. వేదికపై ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, శ్రీ రాయప్రోలు వెంకటేశ్వరశర్మ వున్నారు



ఇంతసేపు రాయబారం ఏమిటి? అతని కళ్ళలో అనుమానం మెరిసింది గుండెలో దుఃఖం విరిసింది.

మెల్లిగా వెనక్కి తప్పుకున్నాడు మోహన్, అపర్ణ వెళ్లేది ఇంట్లోకే కాబట్టి రిక్షా వాడ్ని ఆరా తియ్యాలనుకుని వెంటనే ఇంకొక రిక్షా ఎక్కి కూచున్నాడు.

''ఎక్కడికండి?''

''ఇదుగో జాగ్రత్తగా విను... ఆ ముందు పోతున్న రిక్షాను మటుకు జారిపోనివ్వకు... అలా అని మరీ వెంట వెళ్ళకు మధ్య ఒక పది హేనుగజాల దూరంలో వెంబడించాలి — తెలిసిందా?''

''ఎందుకండీ?''

''అవే అనవసరమైన విషయాలు... పోనీ...'' అని జేబులోంచి పది కాయితం రిక్షావాడి చేతిలో పెట్టాడు. అయినా రిక్షావాడి మీద పూర్తి భారం మోపడానికి ధైర్యం చాల్లేదు మోహన్‌కి. కన్ను రెప్ప కొట్టకుండా ముందు పోయే రిక్షా మీద దృష్టి లగ్నం చేసి జాగ్రత్తపడ్డాడు.

ముందు రిక్షా సెంటరు కెళ్ళి, అక్కడ్నుంచి ఏదో బాడుగ ఎక్కించుకుని బస్‌స్టాండ్‌కు వచ్చింది. వెయిటింగ్- తర్వాత రిజిస్ట్రారు ఆఫీసుకు- మళ్ళీ వెయిటింగ్- ఇలా సాయంత్రం ఐంది. రిక్షా స్టాండు దగ్గర బండి వేరే అతనికి అప్పగించి నడక సాగించాడా ముసలాడు.

రిక్షానుండి ఒక్క దూకులో దిగి... వెంబడించబోతున్న మోహన్‌ను...''ప్రొద్దుటి నుంచీ ఒకటే పనిగా తిరుగుతున్నాం... ఇంకొక పదిప్పించండి'' అని నిలేసిన రిక్షావాడి అరుపు డిస్టర్బ్ చేసింది. బేరం వెయ్యాలన్నా అది సమయం కాదని అని పది వాడికి గిరాటేసి జాగ్రత్తగా వెంబడిస్తున్నాడు మోహన్.

సరిగ్గా దీపక్ హాలు దగ్గరకొచ్చేసరికి సినిమా వదిలారు, జన ప్రవాహం తోసుకు వస్తున్నారు...

అంతే...!!

''క్షణంలో వెయ్యోవంతులో'' రిక్షా అతను అదృశ్యమైనాడు... ''క్షణంలో లక్షోవంతులో'' మోహన్ దవడ కండరం బిగుసుకుంది.

అతని కళ్ళనుండి ధారగా నీరుకారుతోంది. అది అణుచుకోలేని బాధ వల్ల వస్తోందో... లేక పొద్దున్నుండి కళ్ళు పెద్దవి చేసుకుని వచ్చేట్టు మాడ్డం వల్ల వస్తోందో తెలీడంలేదు...

ఉద్వేజనోద్భూత భీభత్స భ్రాంతమైన... అతని మనసు... కలరాశ్వంలా బిగుసుకుంది... గుండె పగిలిన ఆకాశంలా... భీతావహంగా వుంది అతని హృదయగోళం... ఇంతలో భయంకరంగా అరుస్తూ ఓ తీతువు ఉత్తరంగా ఎగిరిపోయింది.

ఆ గుండె ఘోషలో... అనుకున్నాడు... తను ఘోరంగా విఫలమయ్యాడని...! 'హు... విధి ఎంత బలీయమైంది?' క్రూరంగా తనలో తనే నవ్వుకోసాగాడు... మోహన్... ఏమిటా నవ్వు? నిస్త్రాణా?? నిర్లిప్తతా??? లేక... నిర్‌వ్యష్ఠితా????!


* * *

చదువుతున్న నాకు అరికాలి మంట నెత్తికెక్కింది... ఏమిటో తెలీని కసి. తలెత్తేసరికి కాఫీ కప్పు తో రాధి... నా మొహంలోకి పరీక్షగా చూసి తృప్తిగా తలపంకించింది...

"నేననుకున్న అఫెక్టు పాఠకులలో కలుగుతుందా? కలగదా? అని పొద్దుట నుండి ఒకటే మధన పడిపోతున్నానండి... ఇప్పుడు మనసుకి తేలికగా వుంది..." అంది రాధి.

"ఏమిటా ఎఫెక్ట్...?"

"మోహన్ పరిస్థితి పొద్దుటి నుంచి అన్నం లేకుండా... కనీసం కాఫీ తాగడానికైనా... ఏ హోటల్లోకి




వెళ్ళలేని విచిత్ర పరిస్థితులలో గమ్యం తెలీని బాటసారై... కన్నార్పితే రిక్షావాడు జారిపోయి... తన నిరీక్షణ ఎక్కడ భగ్నమౌతుందో...నని డోలాయమానమైన... మనసుతో... నీర్సంగా వెంటాడుతున్న అతను... చివరి దశలో 'క్షణంలో వెయ్యోవంతు' సమయంలో తన ప్రయత్నం భగ్నమైనప్పుడు... అతని మనోవేదన ఎలా వుంటుంది? దీన్ని నేను నా పాఠకులకు సరిగ్గా అందించగలనా?... మోహన్ పడ్డ బాధలో పదోవంతైనా... వాళ్ళు అనుభవిస్తారా?"... అని పొద్దుటి నుండి గుంజాటన పడుతున్నాను.

"కాని మీరు కథ చదవడం మొదలు పెట్టినప్పటిలా కాక... చివరకు వచ్చేప్పటికి... ఎర్రపడ్డ మీ కళ్ళు... రొప్పుతూ బాధతో మెలికలు తిరిగిన మిమ్మల్ని చూసి నేను ఆశించిన ఎఫెక్టు వచ్చిందనే ధైర్యం కల్గుతోంది. ఏమంటారు... మీరేం మాట్లాడరేం?..."

"... ఆ... వచ్చింది... రాక వస్తుందా? పదో వంతు బాధేం ఖర్మ- వందరెట్లు ఎక్కువగా వచ్చి గుండెదడ కూడా మొదలైంది. అంతే కాదు... విపరీత మైన సస్పెన్స్‌తో చచ్చిపోతున్నాను...

అపర్ణ ఈ ఇద్దరిలో ఎవర్ని చేసుకుంటుంది? మోహన్‌ను ఎన్నుకుంటుందా? లేక రిక్షావాడిలోనే... తన 'హీరో'ను చూసుకుంటుందా? అలాంటప్పుడు తన రిక్షాని మోహన్‌కిచ్చేసి... వాడు అపర్ణను చేపడతాడా?... ఒకవేళ ఇచ్చినా మోహన్‌కు రిక్షా తొక్కే నేర్పు... బలము... లైసెన్సులు వున్నాయా?... అదీ గాక..."

"ఆపండి... ఏమిటా అర్థం లేని సమస్యలు..." రాధి కేకకు నేను ఓ క్షణం నిరుత్తరుడనయ్యాను...

"అది సరే... నిస్త్రాణా, నిర్లిప్తతా అన్నాక 'నిర్‌వ్యష్ఠితా' అని వ్రాశావు. అంటే అర్థం ఏమిటి? ఆ ముందు రాసిన వర్ణన ఏమిటి?"

"ఏమోనండీ! నాకూ తెలీదు. కానీ అక్కడ ఆ సందర్భంలో 'ని' తో మొదలయ్యే... బాగా వత్తులున్న మాట పడాలి. లేకుంటే ఎఫెక్టు రాదనిపించింది..."

"మరి అలా అర్థం లేని మాటలు ఎడిటర్ కొట్టేస్తాడుగా?"

"అబ్బే అలాంటి భయం అక్కర్లేదు. మామూలు ధోరణిలో వ్రాసే కథలు... నవలలూ... మొదట్లో ఇలా పాఠకుల్ని అక్కడక్కడ దడిపిస్తూ వ్రాయడం ఇప్పటి ఫేషన్. ప్రింటు వెయ్యడం కూడా తేలిక... వున్న వత్తులు తీసి వేసినా, కొత్తవి కలిపినా పెద్ద ఇబ్బంది వుండదు కనుక అందుకే అన్నాను... మీకు 'టెక్నిక్' వంట బట్టలేదని... అక్కడక్కడ దేముడి గురించి కామెంట్ చెయ్యాలి. తీతువు, గుడ్లగూబ, పొంచి చూస్తున్న రెండు కళ్ళు లాంటి మాటలు పడాలి- అప్పుడు కథకి వెయిటొస్తుంది."

నాకు అంతా అయోమయంగా వుంది. నేను రచయితను కాకపోవచ్చు. కాని ఏదైనా కథ రాయాలనుకున్నప్పుడు రచయితలు ముందుగా ప్లాట్ రెడీ చేసుకుని, ప్రతీ కేరక్టరు ఎలా వుండాలి, చివరికి ఎలా మలుపు తిప్పాలి, కొసమెరుపుల్లాంటివి ఏమిటి అని ఆలోచించుకుంటారనే ఉద్దేశ్యంతో వున్న నేను... ఈ కొత్త 'టెక్‌నిక్' ల గురించి ఏమీ తెలియని వాడ్ని అయ్యాను. పైగా నాకీ వార పత్రికలు వగైరా చదివే అలవాటు అంతగా లేదు...

"సర్లే! ఇంతకీ కథని ఎటు తిప్పుతూ... నవలలో మార్పులు చేరుస్తున్నావ్."

"నిన్నటి నుండి అదే ఆలోచనలో వున్నానండీ! ఇప్పుడు మీరు వేసిన ప్రశ్నను బట్టీ నవల ట్రాజెడీ చెయ్యాలి... రిక్షావాడితోనే హీరోయిన్ పెళ్ళి జరగాలి..."

"ఛ... అదేం బాగోలేదు... అంత ఖర్మదేనికి?"

" 'త్యాగం' అండీ! కొవ్వొత్తి తను కాలిపోతూ కూడా... లోకానికి... వెలుగు చూపినట్లు... అన్న మాట...".

"దానికీ... దీనికీ పోలికేమిటో... నాకేం అర్థం కావట్లేదు..."

"మీకు ఈ చిట్కాలవీ... అర్థం కావు అన్నాను కదా!... మన రచన పడాలంటే మొదట దాన్ని ట్రాజెడీ చెయ్యాలి. రెండు... అందులో త్యాగం వుండాలి. మూడు సెంటిమెంటు గుప్పించాలి. ఏ మాత్రం అవకాశం వున్నా ఒకరేప్, ఆ తర్వాత హీరోతో మంచి ఫైటింగ్‌లు, అక్కడక్కడ డ్యూయెట్లు వుండేలా చూస్తే... మన అదృష్టం... బాగుంటే... సినిమా వాళ్ళు తీసుకునే అవకాశం కూడా వుంటుందండి..."

"ఏమో... నాకే మాత్రం నచ్చలేదు..."

"మీ కెందుకు మీరలా చూస్తూవుండండీ! మీరు చెప్పినట్లు వ్రాసిన కథ, నేను చెప్పిన ముగింపుతో ఇదే కథ రెండూ పంపుదాం... ఏది పడుతుందో... ఏమి అవుతుందో చూద్దాం..."

చెయ్యగలిగిందేమీ లేక... ఈ వ్యవహారంలో ప్రేక్షకుడిలా... మిగిలిపోయాను.

అనుకున్నట్లు రెండు కథలూ పోస్ట్ చేశాక రిజల్ట్ కోసం చూస్తోంది రాధి. ఏడెనిమిది వారాల తర్వాత కాబోలు... రాధి రచన తీసుకున్నట్టు... లెటరొచ్చింది.

"చూశారా? నేను ఎంత చెప్పినా మీరు నమ్మలేదు... ఇప్పటికైనా... 'టెక్‌నిక్' అర్థమయిందా?" అంది రాధి.

"అన్ని పత్రికలూ ఇంతేనంటావా?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"అయ్యోరామ! అదేం కాదు! మనం జాగ్రత్తగా పత్రికను... ఎన్నుకోవడంలో వుంటుంది. అదీ ఒక టెక్‌నిక్కే!! ఇంక ఇవన్నీ దృష్టిలో వుంచుకని మీరూ రాయడం మొదలు పెట్టండీ..." అంది శ్రీకృష్ణుడికి హితోపదేశం చేస్తున్న శ్రీదేవి లా పోజు పెట్టి...!